క్లుప్తంగా

వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



గుడ్లవల్లేరు: మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. పూజా కార్యక్రమాల్ని మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి, బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు పాల్గొన్నారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

లంకపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సోమయ్య

పమిడిముక్కల: వైఎస్సార్ సీపీ లంకపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ముళ్లపూడి సోమయ్యను ఎంపిక చేసినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్ తెలిపారు. ఆదివారం నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రధాన కార్యదర్శులుగా వేమూరి రమేష్, పిల్లి జయరాజు, చెన్నకేశవ వెంకటేశ్వరరావు, గండ్రపు గురకయ్య, కార్యదర్శులుగా మేత్ర వెంకటేష్, గొరెకపూడి చంద్రయ్య, కుంపటి సుందరరావు, గుర్విందపల్లి చింతయ్యలను ఎంపిన చేసినట్లు తెలిపారు.

సత్యదేవుని ఆలయ పునర్నిర్మాణానికి విరాళాలు



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు గొల్లపూడికి చెందిన దాత మాచినేని అరవింద్ గోష్ రూ.50వేలు విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని ఆదివారం గుడ్లవల్లేరు ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావుకు అందించారు. అలాగే కోడె జనార్దన రూ.5,116 విరాళంగా అందజేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగళ్ల నాగేశ్వరరావు, మాజీ ఉప సర్పంచి అడుసుమిల్లి సుబ్బయ్య పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధే ధ్యేయం

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు శ్రీగంగానమ్మ గుడి, శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయ అభివృద్ధే ప్రధాన ధ్యేయమని ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు అన్నారు. ఈ రెండు ఆలయాల అభివృద్ధి పనులకు వచ్చిన విరాళాలపై గుడ్లవల్లేరులో ఆదివారం జరిగిన సమావేశంలో వల్లభనేని మాట్లాడారు. ఇప్పటి వరకు జరిగిన ఆలయాల అభివృద్ధిపై చర్చించారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొసరాజు బాపయ్యచౌదరి, ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగళ్ల నాగేశ్వరరావు, ఆలయ ధర్మకర్తలు నరేష్, రవి, చాపరాల సుధాకర్, మాజీ సర్పంచి పల్లెం నరసింహారావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ



నందివాడ: మండలంలోని శంకరంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువ నాయకుడు నూలు మహేష్ శనివారం ఆకస్మికంగా మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, ఎంపీపీ పేయ్యల ఆదాం, కృష్ణాజిల్లా జనరల్ సెక్రెటరీ కందుల నాగరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నూలు మహేష్ కుటుంబానికి అండగా ఉంటామని వారు తెలిపారు. నాయకులు చింతగుంట రమేష్, తాతబ్బాయి పాల్గొన్నారు.

పిచ్చమ్మకు డీఎన్నార్ నివాళులు



ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కై కమ్మ మాతృమూర్తి ఇంతేటి పిచ్చమ్మ భౌతికకాయానికి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆదివారం నివాళులర్పించారు. పిచ్చమ్మ శనివారం ముదినేపల్లిలోని స్వగృహంలో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న డీఎన్నార్ ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు ఈడె వెంకటేశ్వరమ్మ, పార్టీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, ఈడే వెంకటేశ్వరరావు, మోట్రు ఏసుబాబు, కొప్పుల కిషోర్, సింగంశెట్టి రాము, రాచూరి కుమార్, సాక్షి సాయి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



పగుళ్లిచ్చిన కరకట్ట రహదారి



కోతకు గురైన రహదారి



కరకట్ట రహదారిపై ఏర్పడిన గుంత

రోడ్లు ఇలా.. ప్రయాణం ఎలా..!

పమిడిముక్కల: కృష్ణా కరకట్టపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. కరకట్ట యనమలకుదురు నుంచి పులిగడ్డ వరకు విస్తరించి ఉంది. మోపిదేవి, అవనిగడ్డకు దగ్గరి దారి కావడంతో నిత్యం వాహనాలు, ఆర్టీసీ బస్సుల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. దీనికి తోడు భారీ లోడుతో ఇసుక టిప్పర్లు తిరుగుతుంటాయి. ఈ మార్గం గుండా లంక గ్రామాల ప్రజలు తాము పండించిన ఉత్పత్తులను విజయవాడకు తరలిస్తుంటారు. ఈ రహదారి తోట్లవల్లూరు మండలంలోని గుర్విందపల్లి లాకుల నుంచి పమిడిముక్కల మండలంలోని లంకపల్లి వరకు ప్రమాదకరంగా ఉంది. రహదారి పలుచోట్ల గుంతలు పడి, పగుళ్లిచ్చి, కోతకు గురై ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఐనపూరు, లంకపల్లి ప్రాంతాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో ముళ్లపొదలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడని పరిస్థితి నెలకొంది. రహదారికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని దివిసీమ వాసులు కోరుతున్నారు.



ఐలూరు సమీపంలో కుంగిన రోడ్డు



లంకపల్లి వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

వైభవంగా గంగానమ్మ జాతర

కై కలూరు: స్థానిక బైపాస్ రోడ్డులో కొలువైయున్న గంగానమ్మ అమ్మవారి సంబరం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ప్రతి ఏటా శ్రావణమాసంలో అమ్మవారికి సంబరం నిర్వహించడం ఆనవాయితీ. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సింగంశెట్టి రాము, పట్టణ అధ్యక్షుడు సమయం రామాంజనేయులు, నాయకులు గంటా అనిల్, పంజా రామారావు, పంజా నాగు, ఉండ్రమట్ల ఏసుకుమార్, సుంకర శివ, ప్రకాష్, బొర్రా సన్యాసిరావు, జక్కా రాజేష్ పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లిలో యాదవ కులస్తుల గంగానమ్మ జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గంగానమ్మ తల్లికి వేడి, చల్ది నైవేద్యాలు సమర్పించారు. ఏడాది పొడవునా తమను చల్లగా చూడాలని అమ్మవారిని ప్రార్థించారు. పెద్ద సంఖ్యలో యాదవ ప్రముఖులు పాల్గొన్నారు.



గంగానమ్మ తల్లికి పూజలు చేస్తున్న డీఎన్నార్

సుబ్బారాయుడి ఆలయంలో భక్తుల రద్దీ



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. భక్తులు పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపు కుంకుమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా అన్నప్రసాద ఏర్పాట్లు చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి పర్యవేక్షించారు.

370 మంది దివ్యాంగుల పెన్షన్లు తొలగింపు



కూచిపూడిలో నోటీసులు అందిస్తున్న సచివాలయ సిబ్బంది

మొవ్వ: కూటమి ప్రభుత్వం దివ్యాంగులు, మంచానికే పరిమితమైన రోగుల పెన్షన్లు పరిశీలించిన అనంతరం మండలంలో 370 మందిని అనర్హులుగా గుర్తిస్తూ సెప్టెంబర్ నెల నుంచి పెన్షన్లు నిలిపి వేసేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే రూ. 15 వేలు పెన్షన్ తీసుకునే లబ్ధిదారుల్లో నలుగురిని పూర్తి అనర్హులుగా ప్రకటించారు. అలాగే దివ్యాంగుల పెన్షన్‌గా రూ.6 వేలు తీసుకునే లబ్ధిదారుల్లో 366 మందిని అనర్హులుగా గుర్తించారు. అయితే రూ. 15వేలు తీసుకునే లబ్ధిదారుల్లో 26 మందిని దివ్యాంగుల పెన్షన్లకు, మరో 25 మందిని వృద్ధాప్య పెన్షనుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మొవ్వ మండలంలో తొలగించిన పెన్షన్ల వివరాలు..

పెదపూడి సచివాలయంలో 35, పెదముత్తేవిలో 10, అవురుపూడిలో 33, చినముత్తేవిలో 20, భట్ల పెనుమర్రులో 20, మొవ్వ–1 లో 32, మొవ్వ–2లో 18, కూచిపూడిలో 30, కోసూరులో 31, నిడుమోలులో 25, మంత్రిపాలెంలో 29, అయ్యంకిలో 23, పెడసనగల్లులో 15, వేములమడలో 9, కాజ–1లో 16, కాజ–2 లో 20 తొలగించారు. అలాగే రూ. 15 వేలు పెన్షన్లు అయ్యంకి, నిడుమోలు, మొవ్వ–1, కోసూరు సచివాలయాల్లో ఒక్కొక్కటి పూర్తిగా రద్దయ్యాయి. ఈ మేరకు ఆయా సచివాలయాల వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ప్రభుత్వం పంపించిన సమాచార ఉత్తర్వులను ఆయా లబ్ధిదారులకు అందజేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ప్రభు



గూడూరు: విజయవాడ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో ఆదివారం జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లా బాల్ బ్యాడ్మింటన్ సీనియర్ జట్టుకు గూడూరు మండలం కప్పలదొడ్డికి చెందిన బి.శివనాగప్రభు ఎంపికయ్యాడు. ఈనెల 29 నుంచి ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రభు ప్రాతినిధ్యం వహించనున్నాడు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన శివ నాగ ప్రభును పలువురు అభినందించారు.

శ్రీకృష్ణుడు అందరివాడు

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ భగవానుడు భారతీయులకే కాక 154 దేశాల్లో ఆరాధించబడుచున్న భగవంతుడని గుడివాడ నియోజకవర్గ యాదవ సేవా సంఘం నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరు రోడ్డులోని కృష్ణ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత 17 రోజులుగా కృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించామన్నారు. శనివారం శ్రీకృష్ణ భగవానుని ఊరేగింపు కార్యక్రమానికి సహకరించిన మున్సిపల్ అధికారులు, పోలీసులు, వ్యాపారులు, పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం గుడివాడ నియోజకవర్గ అధ్యక్షుడు డొక్కు రాంబాబు, నాయకులు ఆర్‌వీఎల్ నరసింహరావు, లోయ రాజేష్, ఎం. సతీష్, జి. మురళి, కె.సతీష్, దిమ్మిట హర్ష, కొలుసు శ్రీను, పి.వెంకటేశ్వరరావు, జోగా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న యాదవ సంఘం నాయకులు

ఆర్టీసీకి ఆదాయం లోటు

ఒక్కరోజుకే అవనిగడ్డ డిపోకు రూ.4.36 లక్షల ఆదాయ లోటు

చల్లపల్లి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో అవనిగడ్డ ఆర్టీసీ డిపో ఆదాయానికి గణనీయంగా గండి పడింది. డిపోలో 85 బస్సులు నడుపుతుండగా వాటిద్వారా ప్రతి రోజూ సగటున రూ.11 లక్షలు ఆదాయం వచ్చేది. ఈనెల 15వ తేదీన స్త్రీశక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి శ్రీకారం చుట్టారు. శనివారం అవనిగడ్డ డిపోకు చెందిన బస్సులో మొత్తం 15,045 మంది ప్రయాణికులు ప్రయాణించారు. వారిలో 9,565 మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు. శనివారానికి మొత్తం రూ.12,88,103 ఆదాయం రావాల్సి ఉండగా అందులో రూ.4.36 లక్షలు ఆదాయం లోటు ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. ఒక్క రోజులో ఒక్క అవనిగడ్డ డిపోకే రూ.4.36 లక్షలు ఆదాయం తగ్గితే రాష్ట్రం మొత్తం మీద ఎంత ఆదాయం లోటు ఉంటుందో ఆలోచించడానికే భయం వేస్తోందని సామాజిక వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే నష్టాల్లో కూరుకుపోయిన ఆర్టీసీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకంతో మరింత నష్టాల ఊబిలోకి కూరుకుపోనుందా? అని కొందరు ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి, హోమియో వైద్య శిబిరాలు

చల్లపల్లి: స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి వైద్యుడు మోహనరావు 50 మందికి పరీక్షలు జరిపి వారిలో 17 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి విజయవాడలోని అమరావతి కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయించనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ళ వెంకటరత్నం తెలిపారు. దీంతో పాటు నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 28 మందిని పరీక్షించి ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేసినట్లు వివరించారు. కోశాధికారి జూపూడి కిరణ్, సభ్యులు ద్రోణ, దింటకుర్తి జ్యోతి, అన్నం సత్యవాణి, వరదా హరిగోపాల్, తమ్మన సతీష్, మలిశెట్టి చెంచురాములు శిబిరాలను పర్యవేక్షించారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు మోహనరావు

పాత పెన్షన్ విధానం అమలు చేయండి

గుడివాడ టౌన్: ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్జీఓస్ హోమ్‌లో పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ నిర్వహించనున్న ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె.లక్ష్మీ శ్రీనాథ్ మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన విజయవాడ ధర్నా చౌక్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లా నాయకత్వం ఆధ్వర్యాన ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. పాత పెన్షన్ విధానం అమలులో ప్రభుత్వం నుంచి తమకు ఏ విధమైన స్పందన లేదన్నారు. కావున 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం ధర్నాకు పిలుపునిచ్చిందని చెప్పారు. తమ సమస్యల పరిష్కారానికి అన్ని ఉపాధ్యాయ సంఘాలు, ఏపీ ఎన్జీఓస్ అసోసియేషన్ మద్దతు ప్రకటించారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీఓస్ అసోసియేషన్ గుడివాడ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ ఫరీద్ బాషా, జి. రాజేంద్రప్రసాద్, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకరరావు, జిల్లా కార్యదర్శి ఏవీ వరలక్ష్మి, నాయకులు జి. రాజారావు, ఎం.శ్రీనివాసరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.చంద్రశేఖర్, ఫోరం జిల్లా కన్వీనర్ జి. జయరాజు, సభ్యులు ఎస్. జయశ్రీ, కె.శ్రీకాంత్, ఏలియా తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌లు ఆవిష్కరిస్తున్న ఫోరం నాయకులు

కనులపండువగా అమ్మవారి వార్షికోత్సవాలు

గుడ్లవల్లేరు: మండలంలోని కౌతవరం ఒకటో వార్డు నెయ్యలవారి శ్రీకనక దుర్గాదేవి అమ్మవారి వార్షికోత్సవాలు ఆదివారం కనులపండువగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. చిత్ర విచిత్ర దేవతా వేషధారణలతో నృత్యాలు చేస్తూ.. అమ్మవారి ఊరేగింపు చేశారు. స్థానిక యువ కళాకారులు చేసిన నవగ్రహాల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మవారి ప్రభను కనకడప్పుల వాయిద్యాలు, బాణాసంచాతో కౌతవరం, గుడ్లవల్లేరులోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు.

అలాగే శ్రీకొండలమ్మ అమ్మవారికి భక్తులు పాల పొంగళ్లను పొంగించిన మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారి దర్శనానికి క్యూలైనుల్లో భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



కౌతవరంలో దుర్గాదేవి ప్రభ ఊరేగింపు

గంగానమ్మ ఆలయంలో భక్తుల సందడి

పమిడిముక్కల: స్థానిక గంగానమ్మ తల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. శ్రావణ మాసం ఆఖరి ఆదివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు.

అల్లుకుపోయిన గుర్రపు డెక్క



పెదయెడ్లగాడి వద్ద ఉన్న గుర్రపు డెక్క

మండవల్లి: పెదయెడ్లగాడి వద్ద అల్లుకుపోయిన గుర్రపు డెక్క కారణంగా కొల్లేటి వరద నీరు దిగువకు ప్రవహించడం లేదు. ఎగువనున్న బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు తదితర డ్రెయిన్ల నుంచి వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో కొల్లేటి గ్రామాలైన నందిగామలంక, పెనుమాకలంక, ఇంగిలిపాకలంక గ్రామాల్లోకి వరద నీరు చేరుతుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పెదయెడ్లగాడి వద్ద గుర్రపుడెక్క తొలగించి దిగువకు నీరు వెళ్లేవిధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు అభినందన

గుడ్లవల్లేరు: రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందిన గుడ్లవల్లేరు మండలంలోని అంగలూరు ప్రభుత్వ బాలికోన్నత హైస్కూల్ ఉపాధ్యాయులను ఆదివారం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తన కార్యాలయంలో అభినందించారు. ఈ పాఠశాలను ఆదర్శంగా తీసుకుని మరికొన్ని పాఠశాలలు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. హైస్కూల్లో చదివిన టెన్త్ విద్యార్థులు 74మంది ఉత్తీర్ణులు అయ్యారని.. వారిలో 71 మందికి ఫస్ట్ క్లాస్ వచ్చినట్లు ఎమ్మెల్యే రాముకు హెచ్ఎం జి.జగన్మోహనరావు తెలిపారు. 571 మార్కులతో కతిజ తెహరా అనే విద్యార్థిని షైనింగ్ స్టార్ అవార్డు సాధించినట్లు చెప్పారు. విద్యార్థిని తెహరా ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. ఉపాధ్యాయులు రత్నం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



హెచ్ఎం జగన్మోహనరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే రాము

ఆధ్యాత్మిక శోభతో పులకించిన పాలకాయతిప్ప

- కనులపండువగా సాగిన కోదండ రాముడి ఆలయ, విగ్రహ ప్రతిష్ట
- ధ్వజస్తంభ ప్రతిష్టలో అశేషంగా పాల్గొన్న భక్తజనం

కోడూరు: వేద పండితుల మంత్రోచ్ఛరణలు.. మంగళవాయిద్యాల నడుమ కోదండ రాముడి విగ్రహ ప్రతిష్ట కనులపండువగా నిర్వహించారు. మండలంలోని పాలకాయతిప్ప గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో ఆదివారం ఉదయం శ్రీసీతా కోదండరామ సమేత లక్ష్మణ, హనుమాన్ స్వామివార్ల నల్లరాతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన ఆలయంలో స్వామివార్ల విగ్రహాలను భక్తుల జయ జయ ధ్వానాల నడుమ ప్రతిష్ఠించారు. విగ్రహ ప్రతిష్ట అనంతరం ఆలయ ముందు భాగంలో ధ్వజస్తంభ ప్రతిష్టను కూడా అత్యంత వైభవంగా జరిపారు. ముందుగా గోపూజ చేసి ధ్వజస్తంభాన్ని భారీ క్రేన్ సహాయంతో ప్రతిష్ఠించారు. శిఖరానికి శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం శిఖర ప్రతిష్టను జరిపి, పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

వేలాదిగా పాల్గొన్న భక్తజనం..

పాలకాయతిప్ప గ్రామంలో ఏకకాలంలో నూతన ఆలయ, విగ్రహం, ధ్వజస్తంభం, శిఖర ప్రతిష్టలు ఉండటంతో వీటిని తిలకించేందుకు భక్తుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు మచిలీపట్నంకు చెందిన శతాధిక ప్రతిష్టాచార్యులు మునగలేటి వంశీ శర్మ, పండితులు మొవ్వ శివాజీ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం పలువురు ప్రముఖులు ఉభయదాతలుగా వ్యవహరించి సీతారామచంద్ర స్వామివార్ల శాంతి కల్యాణాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆడపడుచులు సుదూర ప్రాంతాల నుంచి సైతం తరలిరావడంతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది. ప్రతిష్టోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులు ఈ అన్నదానంలో పాల్గొన్నారు. అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు, జనసేన యువనేత మండలి వెంకట్రామ్, పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు ప్రతిష్ఠలో పాల్గొని, స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన స్వామివార్ల విగ్రహాలు



క్రేన్ సాయంతో జరుగుతున్న ధ్వజస్తంభ ప్రతిష్ట

దివ్యాంగుని కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేత



మచిలీపట్నంటౌన్: బందరు మండలం గరాలదిబ్బ గ్రామానికి చెందిన దివ్యాంగుడు అంద్రాజు ఏసుబాబు కుటుంబానికి మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు ఆదివారం నిత్యావసర సరుకులు అందజేశారు. వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఏసుబాబు రెండేళ్ల క్రితం వెల్డింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు హై వోల్టేజ్ విద్యుత్ లైన్స్‌ను తాకడంతో తీవ్ర గాయాల పాలై కుడి కాలు, కుడి చేయిని కోల్పోయాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం ఏ పనీ చేయలేక మంచానికే పరిమితమై, భార్య చేసే కూలీనాలీ పనులపైనే ఆ కుటుంబం ఆధారపడింది. గ్రామ పెద్ద బొడ్డు వీర వెంకటేశ్వరరావు (నాని) ద్వారా విషయం తెలుసుకున్న మైత్రీ ఫౌండేషన్ బృందం తాత్కాలిక సాయంగా ఆదివారం ఆ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేసింది. భవిష్యత్తులో వారికి వైద్య పరంగా కూడా అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు కేసాని వేణు కుమార్, ఉపాధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి దైవపు రాధాకృష్ణ, ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్ పాల్గొన్నారు.